# సాగర పుత్రులు

శ్రీ సువర్ణశ్రీ

సముద్రం హోరుమంటూ ఒకే అలజడి. భూమాత నులివెచ్చని కౌగిలిలో పులకరించిపోవాలని కాబోలు ఆరాటపడుతున్నాయి కెరటాలు. ఎగసి ఎగసిపడే—ఆ కెరటాల ఆవేశం—తీరని కోరికలతో సతమతమయ్యే లేతహృదయాలను తలపింపజేస్తూంది. ఎటు చూసినా అలలే! అలవోకగా తీరంపై పడి తలలు విరుచుకొనే అలలే! పాపం! వాటి కలలు ఎన్నడూ నెరవేరవు! నెరవేరడంకూడా ప్రకృతికి మంచిది కాదేమో!

నిజానికి అలల కలలే నెరవేరి చెలియలికట్ట నతిక్రమించి వస్తే ఏం జరుగుతుంది? ప్రళయం విజృంభించదా? పల్లెలూ, పట్నాలూ నాశనమైపోవా? అలా కాకూడదు. కనుకే అక్కడ ప్రతి అలా విరిగిపోవలసిందే? ప్రతికలా కరిగిపోవలసిందే! అందుకనే మనవాళ్ళు సముద్రాన్ని విశాల హృదయంతో పోల్చారు. ఇది ఎంత అర్థవంతమైన ఉపమానం! ఈ తీరంపై చిన్న చిన్న గుడిసెల్లో జీవితాలు సాగించే అసంఖ్యాకమైన పల్లీయుల్ని మనం ఒకసారి గమనిస్తే సముద్రం ఎంత కరుణామయస్వరూపమో మనకు అర్థమవుతుంది.. వీరందరికీ తరతరాలుగా సముద్రమే ఏడుగడ. రానురాను పల్లెలు పట్నాలయినా, పట్నాలు మరింత పెద్ద నగరాలుగా మారినా సముద్రాన్ని అంటిపెట్టుకొని ఉన్న ఈ గుడిసెలూ, గూడాలు మాత్రం ఇలానే ఉండిపోయాయి. నాగరికత తళుకు బెళుకులు వీటిపై పనిచేయలేక పోయాయి. రకరకాలుగా సాగిపోతూన్న కాలం ఇక్కడ ఆగిపోయిందేమో ననిపిస్తుంది. అనాదిగా సముద్రాన్ని ఆశ్రయించుకొని వున్నవారిజీవితాల్లో ఏమైనా ఉన్నతి ఉందా అంటే అదీ కనిపించదు. మునుపెలా ఉన్నారో వా రీనాడూ అంతే! అయితే వా రెందుకు ఆ సముద్రాన్నే నమ్ముకు జీవించాలి? అంటేమాత్రం కారణం సరిగ్గా చెప్పలేం. బహుశ: సముద్ర సంగీతానికి వారి బ్రతుకులు అనుపల్లవు లయిపోయాయేమో!

పెట్టినా మానినా తల్లిని విడువని పసిపిల్లలుగా ఆ పల్లీయులు కడలిని గడిచిపోలేరు. సముద్రానికీ వారి జీవితానికీ ఏదో అవినాభావ సంబంధం ఏర్పడిపోయింది. ఆ గభీర సముద్రమధ్యంలోనే వారి జీవనాధారాలన్నీ ప్రోగుపడి ఉన్నాయి. ఏరోజు కారోజు ప్రాణాలకు తెగించి, ఆ భయంకర తరంగాల మధ్యకు పోయి వేటాడాలి. అనునిత్యం వారికోసం—ఈతీరంపై ఎదురుతెన్నులు చూస్తూ—ఈ గుడిసెల్లో ఎందరో వారి ఆత్మబంధువులు వేయి దేవుళ్లకు మ్రొక్కుకొంటూ—కళ్ళు కాయలు చేసుకొని చూస్తూవుంటారు. వేట కెళ్ళిన తమవా రందరూ తిరిగి సురక్షితంగా కొంపకు చేరేవరకూ ఎవరికీ మనశ్శాంతి ఉండదు. వారు వేటకు వెళ్లితేనేకాని వారి ఆకలిమంటలు తీరవు. వేటకు వెళ్లకపోతే ఆకలిబాధ. వెళ్లితే మనోబాధ. మొదటిబాధ తీరకపోతే బ్రతుకు గడవదు. రెండవ బాధ తీరకపోతే బ్రతుక్కి శాంతి ఉండదు. ఈ జీవన్మరణ సంధి అక్కడ ఉన్న ప్రతిగుడిసెలోను ప్రస్ఫుటంగా కనిపిస్తూంటుంది. వేటకు వెళ్ళి కనిపించకుండా ఉండిపోయిన జాలరులకోసం వారి తల్లిదండ్రులు, భార్యాబిడ్డలు కార్చే కన్నీరు ఆ మున్నీటికే తెలియాలి! ఏండ్లు గడిచినా, పూండ్లు గడిచినా వారికోసం నిరీక్షించేవారి శుష్కహృదయాలలో "ఏదో ఒకనాడు వారు తిరిగి రాకూడదా?" అనే ఆశ మినుకుమినుకుమంటూ ఉంటుంది. వారు ఆ అగాధ సముద్ర గర్భంలో కలిసిపోయారేమోననే కఠోరసత్యాన్ని పైకి అది ఎంత నగ్నంగా కనిపించినా సరే—వారు నమ్మలేరు. అలా కనిపించకుండా పోయినవారు—ఏ దూర తీరాలకో—ఏ సుందర ద్వీపాలకో చేరుకొని ఉంటారని—ఏనాటికైనా తిరిగి వస్తారని వారి అంతరాంతరాల్లో ఒక ఆశాలేశం మెరుస్తూ ఉంటుంది. ఆ ఆశకే అనుదినం ఆయువుపోస్తూ కనిపించని తన ఆత్మబంధువుల కోసం నిండు జీవితాలనే నిరీక్షణకు అంకితం చేస్తూ ఉంటారు. ఒడలు కొంకర్లుపోతూన్న చలికి—కుంపట్లో నిప్పుల బూడిదను విదలించుకొంటూ వారు తమ ఆత్మీయుల జ్ఞాపకాల్ని నెమరువేసుకొంటూ ఉంటారు. ఉత్సాహంతో ఎగసి ఎగసి పడుతూన్న ఈ అలలపైనే వారు పయనించారు. ఇవి వారిని దగా చేయవు. తప్పకుండా ఎప్పుడో ఒకప్పుడు వారిని ఇంటికి చేర్చగలుగుతాయని వారి గుడ్డినమ్మకం. ఆ అలల అలజడి అంతా కూడా వారికి ప్రియ సందేశంగానే వినిపిస్తుంది. "వారు వస్తారు. తప్పక వస్తారు" అని నొక్కి చెపుతున్నట్లుగా ఉంటుంది. అర్థంలేని వారి నిరీక్షణకు సముద్రుని హృదయం ఎంత ద్రబద్దలవుతూందో ఎవరికీ తెలియదు. ఎన్ని విషాదసంఘటనలు ఆయనగర్భంలో ఇముడ్చుకొని పైకి కరాలెత్తి అలా గగ్గోలుపెడుతున్నాడో ఎవరికీ తెలియదు. చరిత్రకందని ఎన్నో సత్యాలూ, సంఘటనలూ, జీవితాలూ ఈ కడలికడుపులో సుప్తమైపోయాయి. బహుశః ఈ నిష్ఠుర విషయాల తాలూకు విషాదమే కాబోలు

బడబానల మంటే! ఈ బడబాగ్నితో అతనికడు పుడికి ఎంతగా ఘోషించినా ఆ భావం—ఆ నిరర్థక నిరీక్షకులు గ్రహించినట్లు కనిపించదు. తను ముదలకించి ముందుకు పంపించే అలల జవానుల్ని వెనక్కి రప్పించుకోక తప్పదు. అనుదిన పరిచితమైన ఆ ముఖాలకూ—ఆ నిరీక్షణకూ — సముద్రుడు కూడా అలవాటుపడిపోయాడు. వారి శూన్యదృక్కుల్ని చూసి మరింత జాలిపడ్డం తప్ప గత్యంతరం లేదనుకొన్నాడు. ఒకవైపు మృత్యుభయం—మరొకవైపు బ్రతుకు భయం—విచిత్రంగా అధికారం చేస్తున్న ఈ గూడెంలోనే ఉన్నాడు మన గంగయ్య.

గంగయ్యకు నిండుగా ముప్పైఏళ్లయినా నిండలేదు. కాని అతడు ఏభైఏళ్ల ముసలివాడుగా కనిపిస్తాడు. వయస్సు పెరక్కపోయినా—ముసలితనంలో జేరిపోయిన దురదృష్టవంతుల కోవకు చెందినవా డతడు. పసివారు వర్తమానం చూసుకొనీ—పడుచువాళ్ళు భవిష్యత్తు చూసుకొనీ—ముసలివాళ్లు భూత కాలం చూసుకొనీ—మనుగడ సాగించడం రివాజు. గంగయ్య వయస్సు రీత్యా పడుచువాడే. కాని అతడికి కనిపిస్తూన్న భవిష్యత్తేమీ లేదు. పరిణామరీత్యా గంగయ్య ముసలివాడే. కాని అతనికి చెప్పుకోదగినంత గతం కూడా లేదు. అతనికున్నదల్లా వర్తమానమే! అలాగని అతణ్ణి పసివా డనలేంగదా. ఈరోజెలా గడపాలి? ఇదే అతని సమస్య. తనకోసం—తనతోపాటు ముసలిదైపోయిన రత్తికీ—తన నలుగురు బిడ్డలకూ గంజి నీళ్ళు పోయడ మెలా? ఈవేళ గడిస్తే చాలు. రేపటిమాట దేవుడెరుగు! ఇదే అతని నిరంతర వ్యావృత్తి. అలాగని గంగయ్య పనిపాటులు చేయని సోమరిపోతు కాదు. కష్టపడి వేటాడతాడు. అందరికంటె ముందుగానే లేచి తన వేట నావపై సముద్రంపై వెళ్లిపోతాడు. అందరికంటె ఆలస్యంగా కూడా ఇంటికి చేరుకొంటాడు. కాని అతని దురదృష్టం ప్రతిరోజూ ఒకేలా ఉంటూంది. తన ఇన్నేళ్ల జీవితంలో ఒక్కనాడైనా మరునాటి చింత లేకుండా చేసుకోలేకపోయాడు. ప్రతి దినం అతడు రెక్కలు ముక్కలయేలా కష్టపడ్డం తప్పడం లేదు. తనకు దొరికిన చేపల్ని దళారులకు అయినకాడికి తెగ నమ్ముకొని జీవితాన్ని ఎదుర్కోక తప్పడంలేదు. పోనీ అతనికి ఏవైనా దుర్వ్యసనా లున్నాయా అంటే అవీ కనిపించవు. అతని సంసారం పెద్దదయింది. కాని సంపాదన మామూలుగానే ఉండిపోయింది. తను ఏ కొద్దో ఎక్కువే సంపాయించినా తన స్థాయి మాత్రం మామూలుగానే ఉండిపోయింది. రత్తిని పెండ్లాడిన క్రొత్తలో గంగయ్య ఏవేవో కమ్మని కలలు కన్నాడు. తను కష్టపడి రత్తిని రాణిలా చూసుకోగలననీ—రతనాలతో పూజించుకోగలననీ ఆశించాడు. కాని అవన్నీ వట్టి కలలేనని అతనికి తెలిసిరావడానికి ఎంతోకాలం పట్టలేదు. రత్తి రాణి కాలేదు! కాని ఏడాది తిరిగేటప్పటికి తల్లి అయింది. ఆమెను రతనాలతో పూజించలేదు. అప్పుడప్పుడు శుష్కోప పాసాలతో కృశింపజేశాడు. ఈ బ్రతుకు లతనికి భయం కలిగించినమాట వాస్తవమే. కాని ఏం చేసేది? ఈ సుడి గుండంలో గింగిర్లుతిరక్క తప్పడంలేదు. మరొక ఏడాది గడిచేటప్పటికి రత్తి మరొక శిశువును ప్రసవించింది. తమ కాపురంలోనికి వచ్చిపడే ఈ క్రొత్త అతిథుల్ని చూసి రత్తీ గంగయ్యలు మురిసిపోతున్న మాట నిజమే. అయినా ఈమురిపెంతోబాటు వారి లాలనా—పాలనా చూడడంలో వారు కృంగిపోతున్నారు. ఆ పిల్లలకు గాలి సోకినా—ధూళి సోకినా పంతులుగార్ని పిలవక తప్పదుకదా! వా రిచ్చే మాత్రలకూ, రక్షరేకులకూ అగడం, పగడం వారికి ముట్టజెప్పడం తప్పదు కదా! పైగా ప్రతి పురిటికీ రత్తి పునర్జన్మ ఎత్తినంత పనవుతూంది. ఈ సంసార రథచక్రాలక్రింద రత్తీ గంగయ్యల జీవిత కుసుమాలు నలిగినలియై వాడిపోయాయి. ఉన్న ఆ యిద్దరు బిడ్డలతోటే ఆ దరిద్ర దంపతులు సతమతమవుతూంటే—వారు చాలక దైవం వారి కిప్పుడు కవల బిడ్డల్ని ప్రసాదించింది. ఇంట్లో ఏది లేకపోయినా రోజు గడవదు. గంగయ్య మాత్రం ఏం చేస్తాడు? ప్రొద్దల్లా కష్టపడి వేటాడతాడు. ఎంత వేటాడినా ఆ దళారి బేరగాళ్ళిచ్చేది మామూలే! తన సంపాదనతో తన కుటుంబంలో అందరూ సుఖంగా మూడు పూటలూ తిని జీవించే అవకాశం లేదు. ఏదో గంజినీళ్లతో గడుపుకోవలసిందే! గతిలేనివారి నెత్తిపై దేవు డింత బరు వెందుకు పెడతాడోనని గంగయ్య అప్పుడప్పుడు దీర్ఘాలోచనలో పడుతూంటాడు. ఆ ఆలోచన అతనికెంతకీ తెగదు. "ఏందోలే!" అని ఏమీ తోచక తన వేటలో మునిగిపోతూ ఉంటాడు. నిగనిగలాడే చెక్కిళ్ల పసలతో—పిటపిటలాడే పడుచుదనపు బిగువుతో—క్రొత్తపెళ్లి కూతురులా తన జీవితంలో అడుగిడిన రత్తిని తలుచుకొని—మాసిపోయిన చెక్కిళ్లతో—వడిలిపోయిన మేనితో—శుష్కించి పోయిన నేటి రత్తిని చూస్తే—గంగయ్యకు గుండెలు గుబగుబలాడిపోయేవి. రత్తికి ఈ స్థితి కల్పించడానికేనా తను పెండ్లాడింది? కాదు, రత్తిని సుఖపెట్టాలి! సుఖంలో రత్తి తొలినాటి సొగసుదనాలన్నీ పొందాలి. రత్తి సొగకనుల సోయగాల్లో తను మైమరచిపోవాలి. "ఇది సాధ్యమేనా?" అనే సందేహం అతని మనస్సును ఒకసారి నిలవేసి ప్రశ్నించింది. కాని "సాధించాలి" అనే దీక్ష గంగయ్యలో నెలకొన్నది. తాను ఎలాగైనాసరే ఇబ్బడిగా కష్టపడి అయినా డబ్బు సంపాదించాలి. ఏదో కొంత డబ్బు నిలవచేసుకొని తమ జీవితాలు వాడని పూలుగా మార్చుకోవాలి. ఈ నిశ్చయం అతనిలోని ప్రతిజీవకణాన్ని కదిలించింది. అవును, తనకు డబ్బే ఉంటే....! హాయిగా పట్నంలో ఒక చేపల అంగడి పెట్టుకోలేడా? కాలిమీద కాలేసుకుని రత్తితో పరాసికా లాడుకొంటూ—చేప లమ్ముకొని—ఆ లాభంతో కాలం గడపలేడా? పట్నంలో ఎందరు చేపలవర్తకులు లేరు? వారందరూ తన లాగే ఇంటికీ, ఇల్లాలికీ దూరమై అష్టకష్టాలూ పడు

తున్నారా ? హాయిగా జీవించటంలేదా ? అలాగే తనూ జీవిస్తాడు. అందుకు ముందు కావలసింది డబ్బు. అది ప్రోగు చేయాలి. అందుకోసం ఒకటే దీక్షగా పనిచేయడం ప్రారంభించాడు. ఒకోసారి వేటకు పోయినవాడు రెండు మూడు రోజులవరకూ తిరిగి రావడం మానివేసేవాడు. రత్తి ఎలా ఉంటుందో అన్న దిగులు లేదు. తన నడతకు ఆమె ఏమనుకుంటుందో అన్న చింత లేదు. తన ఆరోగ్యం ఏమైపోతుందో నన్న ఊహ అసలే లేదు ! ఏమీ లేదు! ఒకేఒక లక్ష్యం ! డబ్బు. అదే అతని కళ్లముందు నిరంతర నృత్యం చేస్తూవుంది. దాన్ని అందుకోవాలి. తన లక్ష్యాన్ని చేరుకోవాలి. అలసి సొలసి ఇంటికి చేరిన తనకు రత్తితో సరిగ్గా మాట్లాడ్డానిక్కూడా తీరికలేకుండా ఉంది. కాదు, తీరిక లేకుండా చేసుకొన్నాడు. ఆమెను దగ్గరగాకూడా రానీయడం లేదు. అలసిఉన్నాడు కాబోలు పోనీలే అనుకుంటూంది రత్తి. ఆమెను దగ్గరకు తీసుకొంటే తనలక్ష్యం ఎక్కడ దెబ్బ తింటుందోనని గంగయ్యకు భయం. తన లక్ష్యాన్ని సాధించే వరకు రత్తికి మళ్లీ పిల్లలు పుట్టకూడదు. పుడితే మళ్లీ తను తన జీవనయాత్రలో వెనుకపడిపోవలసి ఉంటుంది. అందుకనే ఆమెను చేరదీయడం తగ్గించుకొన్నాడు. కాదు, మానివేశాడు. రత్తి ఏమైనా అనుకొననీ తనకు బాధలేదు. తన లక్ష్యం నెరవేరితే—ఆమే తన్ను అర్థం చేసుకోగలదు. అదే నమ్మకం అతన్ని నడిపిస్తూంది. అంతులేని సముద్రంపై నిర్భయంగా సాగిపోతున్నాడు గంగయ్య. పెను తుఫానులూ, పెడసరపు గాలులూ, సుడిగుండాలూ ఏవీ అతన్ని అడ్డగించలేక పోతున్నాయి. ముందుకు—ఇంకా ముందుకు—చొచ్చుకు పోతున్నాడు గంగయ్య !

## 2

అది పోలేరమ్మగుడి. ఆవేళ జాతర. ఆ పల్లీయులందరూ సమష్టిగా జరుపుకొనే ఏకైక పర్వదినం అదే. అందుకే గుడిసెల్లో జనమంతా అక్కడ గుమిగూడారు. ఏటిపొడుగునా వారు మొక్కుకున్న మొక్కుబళ్లన్నీ దేవికి మహదానందంగా చెల్లించుకొన్నారు పగటిపూట. ఆడా మగా పిన్నా పెద్దా తారతమ్యం లేకుండా ఆ రాత్రి అంతా హడావుడిగా ఉన్నారు. జాతర ముమ్మరంగా సాగుతూంది. డప్పుల మోత రానురాను తీవ్రగతి నందుకొంటూంది. దానితోటే వారి ఉత్సవకోలాహలం కూడా మిన్ను ముడుతూంది. ఒకడు నెత్తిపై గరగతో డప్పుల మోతకు అనుగుణంగా అడుగులు వేస్తున్నాడు. అతని చేతిలో వేపరొట్టా—నొసట పెద్ద కుంకుమబొట్టూ—పచ్చని బట్టతో ముందుకూ, వెనక్కూ ఊరికే అడుగులువేస్తూ వీరావేశం చూపిస్తున్నాడు. అతని నడుం పట్టుకొని అతనితోపాటే తిరుగుతూ—మరొకడు పోలేరమ్మకు సేవచేస్తున్నా ననుకొని మురుస్తున్నాడు. మరికొందరు తాగిన మైకంలో ఏవేవో గంతులు వేస్తున్నారు. మరికొందరు బిగ్గరగా కేకలు వేస్తున్నారు. కొందరు ఆడవాళ్లు తమపైనే పోలేరమ్మ ఆవేశించినట్లుగా—కళ్లింతింతలు చేసుకొని ఊగిపోతూ, ఏవేవో మాటలు చెబుతున్నారు. అలా దేవి ఆవేశించిన ఆడవాళ్ల చుట్టూ చేరి మరికొందరు అతి భక్తిశ్రద్ధలతో వారి మాటలు ఆలకిస్తున్నారు. మరికొందరు వారికి సేవలు చేస్తున్నారు. ఇవేవీ పట్టించుకోని కొందరు పడుచువాళ్లు ఈఅదను బాగా చూసుకొని—తమ తమ కిష్టమైనవాళ్లతో నిర్భయంగా ఎకసక్కా లాడుకొంటున్నారు. ముసిలివాళ్లు కొందరు భక్తితత్వాలు పాడుతూ పోలేరమ్మ మహిమను తమ ప్రక్కనున్నవారికి వారు వింటున్నదీ లేనిదీ గమనించుకోకుండా ఒకే ధోరణిలో చెప్పుకు పోతున్నారు. పిల్లలు ఈసంగతు లేమీ అర్థంకాక—సెనగలూ—జీళ్లూ కొనుక్కొని దంతాలకు పని చెబుతున్నారు. పిల్లల్లో, పెద్దల్లో అందర్లోనూ ఒక బ్రహ్మాండమైన చైతన్యం! వెల్లివిరిసిపోతున్న చైతన్యం! ఇంత చైతన్యస్రవంతి ఈ మూకహృదయాల్లో ఇంతకాలం ఎలా దాగివుండగలిగింది !

ఇంతట్లో క్రమక్రమంగా ఆకాశం మూసుకుపో నారంభించింది. గాలికూడా కొంచెం జోరయ్యింది. మొదట్లో జాతరసందడిలో ఉన్నవాళ్లు ఈ సంగతి గమనించలేదు. కాని గాలి జోరవుతూన్నకొద్దీ ఎవరికి వారికే భయం కలగ సాగింది. ఏనాడూ పోతేరమ్మ దయవలన జాతర భగ్నం కాలేదు. కాని ఈనాడు జాతర తుదివరకూ సాగేలా కనిపించడంలేదు. పోలేరమ్మకు దయతప్పలేదుకదా ! అంతే ! అదే ఆలోచన ఆ ప్రజల నందర్నీ అలముకొన్నది. ఇదివరకే దేవి తనకు పూజలు ఘనంగా చేయనందుకు గూడాన్ని వోచూపు చూస్తానని అన్నట్లుగా ఒకామెపై పూని చెప్పింది. ఇంకేముంది ? అదే నిజమని ఆ అమాయికులందరూ భయకంపితులై పోయారు. “మా అపరాధాలు మన్నించమనీ—మళ్లీయేటికి మరింత ఘనంగా జాతర జరుపుకొంటామనీ—అందులో ప్రతి ఒక్కడూ మొక్కుకొన్నాడు. అయినా దేవి కరుణించినట్లు కనిపించలేదు. క్రమంగా గాలి జోరుతగ్గి చిన్నచిన్న చినుకులు రాలడం ఆరంభమయింది. వెంటనే గరగను గుళ్లో యధావిధిగా ఉంచి ఎవరి గుడిసెకు వారు భయాందోళనలతో దారితీయ నారంభించారు. గట్టిగా గాలి వీచినా, వర్షం పడినా వారి ప్రాణాలు విలవిల్లాడిపోతాయి. ఆ సమయంలో సముద్రంపైనున్నవారి గతి ఏమిటి అనే భయంకర ప్రశ్నార్థకం పాముపడగలా వారి మెదడుల్లో మెదులుతూ ఉంటుంది. వెంటనే ప్రకృతి ప్రశాంతిపొందాలని వారు పోలేరమ్మకు వేయి మొక్కులు మొక్కుకొంటారు. ఏటిపొడుగునా మొక్కిన మొక్కులు తీర్చుకొని కొలుపులు చేసుకొనే ఈనాడే దుర్దినమా ! ఏనాడూ జాతర విరిపి వేయబడలేదు. కాని నే డెందు కిలా జరుగుతూంది ? నిజానికి పోలేరమ్మ తల్లే అలిగితే ఇక ఎవరితో చెప్పుకొనేది ? ఏదో అనర్థం గూడానికి ముంచుకు వస్తోంది. కాకపోతే ఇలా

జరుగదు. "పోలేరమ్మతల్లీ నీవే దిక్కు. మా ఆపదలు కాయి తల్లీ. నీకు పదివేల దండాలు" అంటూ ప్రతిఒక్కడూ విపరీతభయంతో విహ్వలించిపోయాడు.

జాతరనుండి తనగుడిసెకు వెళుతూన్న లచ్చి 'పాపం, సానాకాలంగా నాగమ్మత్తకు ఒంట్లో బాగోనేదుగందా. ఎలా ఉందో సూసిపోదా" మని ఆమె గుడిసెలో ప్రవేశించింది. గుడిసెలో ఒకమూల దీపం గ్రుడ్డిగా వెల్గుతూఉంది. ఒక కుక్కిమంచంపై నాగమ్మా, ఆమె ప్రక్కలోనే పసికందూ పడుకొని ఉన్నారు.

నాగమ్మ ఇరవైయేళ్ల జవ్వనే. కాని ఆమెను జవ్వనిగా ఎవ్వరూ అనుకోరు. దాదాపు ఒక ఏడాది క్రితమే ఆమె భర్త వేటకు వెళ్లాడు. అంతే! ఇక మళ్లీ తిరిగి రాలేదు. ఈ ఏడాది అతనికై నిరీక్షించి నిరీక్షించి నాగమ్మ నవసిపోయింది. ఆమెలోని జీవకాంతి సన్నగిల్లిపోయింది. చావుకు కాళ్ళు చాచిన మనిషిలా తయారయ్యింది. కాని పాపం ఆమెకు భర్త మళ్లీ కనిపించకపోయినా అతని ప్రతిరూపంగా ఒక మగ శిశువు — భర్త పోయిన ఆరుమాసాలకే జన్మించాడు. ఆ శిశువును చూసుకొంటూ, భర్తను తలచుకొంటూ — శిథిలమైన హృదయంలో పాతస్మృతులు రగిలించుకొంటూ — ఎప్పుడో ఒకప్పుడు భర్త తిరిగి రాకపోతాడా అనే పిచ్చినిరీక్షతో కాలం గడుపుతూ వచ్చింది. నిరుడు జాతరకు ముందే ఆమె భర్త ఉత్సాహంగా సముద్రంపై ప్రయాణించడానికి వెళ్లాడు. ఏడాది తిరిగిపోయింది. కాని అతని జాడ లేదు. ఈ దిగులు నాగమ్మను సగం చేసింది. ఆమెలోని జీవశక్తిని పీల్చివేసింది. ఆమె రోగానికి గురి అయ్యింది. చావుబ్రతుకుల్లో ఉందంటే చూచిపోదామని లచ్చి ఆమెవద్దకు వచ్చింది.

ఆమె ఏదో మూలుగుతూ ఉంది. ఆమెకు లచ్చి తన గుడిసె ప్రవేశించినట్లే తెలియదు. "నాగమ్మత్తా! నాగమ్మత్తా" అంటూ లచ్చి ఆమెను పలకరించింది. "ఓరది?" అంది నాగమ్మ బరువుగా. "నాను నాగమ్మత్తా. లచ్చిని" అంది. "నీవా లచ్చీ!" అంటూ లేవబోయింది. చచ్చేటప్పుడుకూడా అతిథిసత్కారం ఒక మానదగని అలవాటుగా మనలో జీర్ణించిపోయింది. "ఒద్దు నాగమ్మత్తా పడుకో. ఊరికే సూదామని ఒచ్చాను. ఎలావుంది ?" అంటూ పరామర్శించింది. "బాగానే ఉంది లచ్చీ. మా రత్తి నోపాలి రమ్మని సెప్తావా ?" అంది ప్రాధేయపడుతూ. "తప్పకుండా సెపుతా నాగమ్మత్తా. బగమంతు డున్నాడులే. బయపడకు" అంటూ లచ్చి ఆ గుడిసె యివతలకు వచ్చివేసింది. "భయపడకు" అని ఏదో చెప్పి బయటకు వచ్చిందేకాని నిజానికి లచ్చికే భయంగా ఉంది ఆమె స్థితి. ఇప్పుడా ఇంకాస్సేపటికా అనేలా ఉంది ఆమె జీవితం! "అన్నెం పున్నెం తెలియని నాగమ్మత్తకీ సావు బగమంతుడే రాసిపెట్టాడా!" అని లచ్చి నివ్వెరపోయింది. ఏడాది క్రితంవరకూ అందాల గులాబిలా పరిమళించిన నాగమ్మత్త ఎంతలో వాడి వత్తలై నేలపై రాలిపో తయారైంది! ఆమెనెవ్వరూ రక్షించలేరు. పతివియోగపు తుదిపరిణామం ఆమెలో నేడు కార్యరూపం ధరించబోతూంది. భయం భయంగా ఆలోచించుకొంటూనే లచ్చి, రత్తి గుడిసె సమీపించింది.

గుడిసె ఇవతలగా కూర్చుంది రత్తి. ఒక బండరాయిపై కూర్చుని—మోకాళ్లపై మోచేతు లానించుకొని, అరచేతుల్లో మొహం పెట్టుకొని శూన్యంలోనికి చూస్తూ ఏదో ఆలోచిస్తూంది. చెదురు చెదురుగా పడుతున్న చినుకులు కూడా ఆమె భావముద్రను చెదరగొట్టలేక పోయాయి. లచ్చి నెమ్మదిగా రత్తిని సమీపించి, ఆమె భుజంపై చేయి వేసింది. అయినా రత్తికేమీ తెలియలేదు. "రత్తీ, రత్తీ. నిన్నేనే" అంటూ భుజం పట్టుకొని వూపగా రత్తి ఈ లోకంలోనికి వచ్చింది. "నీవా లచ్చీ" అంటూ లేచి ఆమెను పల్కరించింది. "ఇదేం సోద్దెవే రత్తీ! సినుకుల్లో కూసుని సింత సేత్తున్నావు దేనికే ?" అంది లచ్చి. "ఏందోలే. మనసేదోలా వుండి ఈడనే కూసుండా. కొలుపు లప్పుడే అయిపోయాయంటే ?" అంది. "నీ మొగం! కొలుపు లాగిపోయాయి" అంది లచ్చి. "కొలుపు లాగిపోయాయా?" అంది రత్తి ఒక్కసారిగా. ఏదో షాకు తగిలినదానిలా, ఏదో వినగూడనిది విన్నట్లు తలపై పిడుగులు పడినట్లుగా, కాళ్లక్రింద నేల క్రిందికి దిగిపోతున్నట్లుగా వుంది రత్తికి. "అదేంటే! అట్టా అయిపోనావు ?" అంది లచ్చి ఆశ్చర్యంగా. "ఏవీలేదు లేయే" అంది రత్తి. "ఏందోలే నాకేంగాని నిన్నోపాలి నాగమ్మత్త రమ్మంది. అట్టా పోయిరా !" అంది లచ్చి. "ఎట్టావుంది నాగమ్మత్తకు?" అంది రత్తి డగ్గుత్తికతో. "ఏం సెప్పను. పోయేపేణం ! ఒచ్చేపేణం ! అంతే!" పాపం నిన్ను సూడాలని ఉందో ఏమో. పోయి సూసిరా" అంది లచ్చి ప్రాధేయపడుతూ. ఒక్కసారి గుడిసెలోనికి చూసింది రత్తి. కవలపిల్లలిద్దరూ ఉయ్యాలలో హాయిగా నిద్రపోతున్నారు. కుక్కిమంచంపై ఎడపిల్లలిద్దరూ కునుకుతీస్తున్నారు. రత్తిభావం లచ్చి గ్రహించిందిలా ఉంది. "నా నీళ్లను అందాకా సూత్తుంటా లేయేఁ! ఎల్లిరా" అంది లచ్చి. రత్తి గబగబా అడుగులు వేసుకొంటూ బైలుదేరింది. రత్తి ఆ వర్షంలోనే నాగమ్మ గుడిసెను సమీపించింది.

నాగమ్మ తనకు ఏమీకాదు. తనభర్త గంగయ్యకే ఏదో దూరపు బంధువు. కాని రత్తీ నాగమ్మల స్నేహం బంధుత్వం కంటె బలమైంది. రత్తిహృదయం నాగమ్మకూ, నాగమ్మ హృదయం రత్తికీ తెలిసినంతగా — ఈ గూడెంలో మరొకరికి తెలియదు. నాగమ్మ తన భర్త పోయిన తరువాత ఇంతకాలమైనా జీవించిఉందంటే అది చాలావరకు రత్తి ఓదార్పులవల్లనే అని చెప్పాలి. పాపం, నాగమ్మ మనోవ్యథ అంతులేనిది. ఎటువంటి ఓదార్పులవల్లనూ ఉపశమించని దుఃఖ మామెది. అందుకే నాగమ్మ అంటే రత్తికి ఆదోలా ఉంటుంది. ఆమె పిలిచిందనగానే గాలికీ, వానకూ కూడా

వెనుకాడకుండా, పరుగుపరుగున అక్కడకు వచ్చి వాలింది. ఎలాఉందో నాగమ్మ !

గాలివానజోరు అతిశయించింది. పిడుగులు, మెరుపులతో ప్రకృతి ఫెళఫెళార్భాటాలు చేస్తూంది. ఇంత భీభత్స సమయంలో నాగమ్మగుడిసెలో అడుగుపెట్టింది రత్తి. గుడ్డిదీపం గాలివిసురుకు రెపరెపలాడి పోతూంది. సన్నని ఆ దీపకాంతిలో ఆ గుడిసెలోని వాతావరణమంతా బితుకు బితుకుమంటూ ఉంది. మృత్యుచ్ఛాయలు ఆ గుడిసెను ముట్టడిస్తూ ఉన్నాయి. కుక్కిమంచంపై కూర్చుని ఒడిలో బిడ్డతో ఏకధాటిగా దగ్గుతూ ఆయాసపడుతూంది నాగమ్మ. ఆమె నాగమ్మకాదు — వట్టి ఎముకలప్రోగు. ఆమె దగ్గు ప్రకృతి భీభత్సంలో ఐక్యమై సరిగా వినిపించడంలేదు. ప్రకృతి ఫెళఫెళమన్నప్పుడల్లా తన పసికందు ఎక్కడ జడుసుకొంటాడనో ఏమో తన గుండెల కదుముకుంటూంది. ఈ దృశ్యం చూసేటప్పటికి రత్తిగుండె లొక్కసారిగా గుబగుబలాడాయి. ఏదో తెలియని ఆవేశం ఆమెను ఆపాదమస్తకం కదిలించివేసింది. "నాగులూ" అంటూ వెళ్ళి ఒక్కసారిగా, రత్తి ఆమెను కవుగిలించుకొంది. నాగులు అప్రయత్నంగా తనచేతిలోని బిడ్డను రత్తిచేతుల్లో ఉంచింది. "ఇక ఈ బిడ్డ నీదే రత్తీ!" అంది ఆయాసపడుతూనే. దూరాన ఎక్కడో భయంకరమైన పిడుగుపాటు. ఫెళఫెళారావాలతో ఏదో పెనువృక్షం నేలకూలిన చప్పుడు. రివ్వున వీచిన గాలివిసురుకు గుడ్డిదీపం ఒక్కసారిగా పెద్దదై ఆరిపోయింది. "ఏటిది నాగులూ, ఎలావుంది నాగులూ !" అంది రత్తి నాగుల్ని కదుపుతూ. నాగుల్లో చైతన్యం లేదు. ఆమె అంతరాత్మ అనంతవిశ్వంలో లీనమైపోయింది. ఈ అనుకోని విచిత్రసంఘటనకు రత్తి ఒక్క క్షణం నిలువునా కొయ్యబారిపోయింది. నాగులు తన్నిందుకేనా పిలిచింది! ఈ పసిబిడ్డను తనచేతుల్లో పెట్టి, తను శాశ్వతంగా కన్ను మూయడానికేనా ! చూచిపోదామని వచ్చిన తను ఇప్పుడేం చేయాలి ? ఈ బిడ్డను ఇంటికి తీసుకువెళ్ళడమా ! మానడమా ? ఇంతలో చేతుల్లో బిడ్డ కెవ్వుమని ఏడువ నారంభించింది. రత్తిలోని మాతృత్వం ఒక్కసారిగా కట్టలు త్రెంచుకొని ప్రవహించింది. ఆ బిడ్డను గట్టిగా గుండెల కదుముకుంది. ఒకసారి నాగమ్మముఖంకేసి చూసింది. అప్పుడే ఆకాశంలో ఒక మెరుపు మెరిసింది. ఆ మెరుపు కాంతిలో నాగమ్మా, నాగమ్మగుడిసెలోని ప్రతి వస్తువూ దీనాతిదీనంగా కనిపించి రత్తిని ప్రశ్నించిన ట్లయింది ! తా నక్కడ నిలవలేకపోయింది. నాగమ్మ ముఖం పైవరకూ ముసుగు వేసింది. చేతులు జోడించి ఒక నమస్కారం చెల్లించింది. గిరుక్కున వెనుదిరిగింది. గుడిసె ఇవతలకు వచ్చింది.

## 3

భోరుభోరున వర్షం కురుస్తూంది. కన్ను పొడుచుకొన్నా కానరాని కటికచీకటి అధికారం చెలాయిస్తోంది. దూరంగా ఏవేవో జంతువుల అరవులు భయంభయంగా వినిపిస్తున్నాయి. అయినా రత్తి చలించలేదు. ఎందుచేతనంటే అంతకంటె భయంకరమైన తుపాను ఆమెమనస్సులో చెలరేగుతూ ఉంది. ఆ పసిబిడ్డతో ఆమె తన గుడిసెవైపుగా కదలింది. పాపం, ఇంకా లచ్చి ఆమెకోసం ఎదురుచూస్తూ కూర్చునే ఉంది.

"అదేందే రత్తీ సేతుల్లో ?"

"నాగులు బిడ్డ."

"నాగు లేఁవయ్యిందేఁ ?"

"సచ్చిపోయింది."

"ఆఁ ! నాగులు సచ్చిపోయిందా ! బిడ్డను నీ కొప్పసెప్పిందా ?"

"అవును."

"గంగయ్యబావకూడా ఈడ లేడు. ఆడికి కోపం రాదేఁ రత్తీ ?" ఈ ప్రశ్నకు రత్తి నిలువునా వణికిపోయింది. అంత వర్షంలో నడచివచ్చినా వణకని రత్తి ఈ ప్రశ్నకు గజగజలాడిపోయింది.

"ఆడొత్తే నాను సూసుకుంటాన్లేయేఁ ! నువు పోయేఁ!" అంది రత్తి.

"ఛాన్లే. నాకేటి మద్దిని. ఆ పాట్లు నీయే పడు. ఈ సంగతి గూడెంలో తెల్చిందా ?"

"నేదు."

"అయితే ఇప్పుడే సాప్పొత్తాను."

అంటూ లచ్చి తుర్రుమంటూ తూనీగలా పారిపోయింది. ఈపాటె కప్పుడే నాగమ్మ మరణవార్త గూడెంలోనివా ళ్ళందరికీ తెలిసిఉంటుంది. వాళ్ళంతా తదనంతర కర్తవ్యంగురించి ఆలోచిస్తూ ఉండవచ్చు. ఈ వర్షంలో ఆమెను ఏం చేస్తారు ? ఈ వర్షం తగ్గింతర్వాత చూసుకోవచ్చులే అని వూరుకొని ఉంటారు.

రత్తికి తన స్థితి ఏవిఁటో తనకే తెలియడంలేదు. తిన్నగా తన చంకలోని బిడ్డను ఉయ్యాలలో ఉన్న తన ఇద్దరు కవలలప్రక్కను పరుండబెట్టింది. దీపం తెచ్చి ముచ్చటగా ముగ్గురు పిల్లల ముఖాలూ ఒక్కసారి చూసింది. ముగ్గురూ నిద్రపోతున్నారు. ఇంత భయంకరమైన తుపాను కూడా వారిపై ఏమీ పనిచేయడం లేదు. తిరిగి దీపం ఒక

మూలగా ఉంచింది. తాను తన కుక్కిమంచంపై పడుకొంది. నిద్ర రావడంలేదు. ఏవేవో ఆలోచనలు ఆమెను అలముకొంటున్నాయి. "జాతరకు ముందే ఒత్తానన్న గంగులు మావ ఏఁటికి రానేదు ? ఈ తుపానులో గంగులుమావకు ఏటి గతి ?" ఇది తలుచుకొనేసరికి రత్తికి దుఃఖం పొర్లుకు వచ్చింది. ఒక్కసారి నాగులు మనసుకు తగిలింది. తనకూ నాగులు గతే రాసిపెట్టిఉందా ? రత్తిలేతగుండెలు టిమటిమలాడిపోయాయి. అలా జరక్కూడదని, గంగులుమావ సురక్షితంగా తిరిగి రావాలని– అలా చేస్తే పోలేరమ్మకు ఒక మేకపోతును బలిచ్చుకొంటాననీ మొక్కుకుంది రత్తి. అయినా ఆమె ఆందోళన తగ్గలేదు. మొక్కులు ఇటువంటి సమయాల్లో ఫలిస్తాయనే విశ్వాసం ఆమెకు లేదు. "ఏడి ? ఇంకా రాడేం గంగులుమావ ?" అన్న ఒకే ఆదుర్దా ఆమెను రకరకాలుగా బాధించసాగింది. ఈమధ్య గంగులుమావ ఏదోలా వుంటున్నాడు. చీటికీ మాటికీ చీదరించుకొంటున్నాడు కూడా. తను దగ్గరకు వెళితే దూరంగా పొమ్మంటున్నాడు. మావ ఉద్దేశం తన కెంతమాత్రం అంతుపట్టడంలేదు. వేటకెళ్లి ఏరోజు కారోజు కొంపకు జేరుకునే మావ రెండు మూడు రోజులు సముద్రంపైనే ఉండిపోతున్నాడు. ఏం ? తనంటే ఇష్టం విరిగిపోయిందా ? అబ్బే అలా ఎప్పటికీ జరగదు "నువ్వు రత్తివికాదే. నా రతనానివి" అంటుంటాడు అప్పుడప్పుడు. ఆమాట అన్నప్పుడల్లా రత్తికి ఏవేవో నునుసిగ్గులు ముంచుకొస్తాయి. అట్టాంటి మావ, ఇప్పు డెందుకు తనంటే దూరదూరంగా ఉంటున్నాడో రత్తికి అర్థంకాలేదు. ఒక్క తననే కాదు. పిల్లల్నికూడా సరిగా చూడ్డంలేదు. "అయ్యా, అయ్యా" అంటూ దగ్గరకు వెళ్లబోతే కూడా అసహ్యించుకొంటున్నాడు. తను ఏం పాపంచేసిందో తెలియదు. "పోలేరమ్మతల్లీ. నన్ను మా మావ ఎప్పటిలా సూసేలా సేయి తల్లీ" అంటూ ఎన్నో మొక్కులు మొక్కుకుంది. అయినా ఏఁవీ ఫలించలేదు. "ఒత్తున్నాడేమో"నని ఇప్పటి కప్పుడే ఏ ఇరవైసార్లో గుడిసె బైటికి వచ్చి చూసింది రత్తి. గాలికి తలుపు ఏమాత్రం కిర్రుమన్నా గంగులే వచ్చా డనుకొని ఎదురుచూసింది రత్తి. "అసలు గంగులుమావ ఒత్తాడేమో" ననే తను జాతరకు వెళ్లక బండరాయిపై కూర్చుని, లచ్చి వచ్చేవరకూ, అతనికోసమే ఎదురు చూస్తూంది. "ఎంతకూ గంగులు రావడంలేదు. ఏదైనా ఉపద్రవం జరిగిఉండదు కదా !" ఈ తలంపుతో రత్తి ఒక్కసారి భయవిహ్వల అయిపోయింది.

ఈ పరిస్థితుల్లో పులిమీద పుట్రలా ఇప్పుడు నాగులు బిడ్డను తీసుకురావడం ఒకటి. ఇది గంగులుకు ఇంకా ఎంత కోపం తెప్పిస్తుందో తెలియదు. లచ్చి చెప్పనేచెప్పింది. "ఆడికి కోపం ఒత్తే అసలు మనిసిగాడు" చిక్కులుపడ్డ దారపుకొసలా తన బ్రతుకు అయోమయంగా ఉంది. "ఆడి క్కోపం వచ్చినా సరే– అసలు మాఁవంటూ కొంపకొత్తే–ఆపైన సూసుకోవచ్చు" అనుకొంది రత్తి. అయినా "అతడు జీవంతో తిరిగి వస్తాడా ?" అనే శంకే ఆమెగుండెల్లో గునపంలా గ్రుచ్చుకొంటూంది. ఎంతసేపు గుడిసెబైట ఎదురుచూసినా ఆమెకేమీ కనుపించడంలేదు. వర్షం ఇంకా కురుస్తూనే ఉంది. వెంటనే ఆమె లోనికి వచ్చింది. తను నిరుడు తీర్థంలో కొనుక్కు తెచ్చుకొన్న రాములవారి పటంముందు కూర్చుంది. దీపం పెద్దదిచేసింది. ఆ దీపకాంతిలో శ్రీ సీతాలక్ష్మణ హనుమత్సమేత రామచంద్రమూర్తి, ఆమెకనులకు సర్వ మంగళప్రదాయకుడుగా కనిపించాడు. అంతే. ఆ పటం ముందు అలా చేతులుజోడించి నిశ్చలముద్రలో కూర్చుండిపోయింది. ఆమెలోని సంకల్ప వికల్పాలు ఒకదానినొకటి పరస్పరం సంఘర్షించుకొని మూగతనం భజించిన ఒకానొక విచిత్ర మానసిక అవస్థ అది. ప్రళయసమయంలో ఉవ్వెత్తుగా ఎగసిన ఉత్తుంగతరంగాలు ఒకదానినొకటి ఢీకొని ప్రశాంతిపొందిన మహాసముద్రంలా ఉంది, ఆమె మనస్సు. అలా ఎంతసేపు ఆమె కూర్చుండిపోయిందో తెలియదు. వర్షం వడి తగ్గింది. తెలతెలవారుతూ ఉంది. తూరుపు కొండలు చీల్చుకొని, రక్తారుణకాంతితో వేయికిరణాల వెలుగువేలుపు పైపైకి వస్తున్నాడు.

సరిగా ఆ సమయంలో రత్తి గుడిసెతలుపు కిర్రుమంది. రత్తి వెనుదిరిగి చూసింది. ఎవరది ! గంగయ్యమాఁవే ! గంగయ్యమాఁవే ! రత్తి ఆనందం పట్టలేక పోయింది. ఎంత చీకట్లోనయినా తను తన మాఁవను గుర్తించగలదు రత్తి. "మాఁవా" అంటూ ఒక్క అడుగులో వచ్చి గంగయ్య చేతుల్లో వాలిపోయింది రత్తి. "రత్తీ" అంటూ గుండెల కదుముకొన్నాడు గంగయ్య.

"ఈ మూద్రోజుల్నించీ–నీ పేణం ఎట్టావుందోనని...."

"అడిలిపోయావా రత్తీ ?"

"పో మాఁవా ! నీ కంతా ఏదో ఏలాకోలంగా ఉండాది."

"కాదు. నీ బత్తినిసూసే అనుకొండాను."

"ఏఁటని ?"

"రత్తి బాగా బయపడి ఉంటాదని."

"నీవిట్టా ఎప్పుడూ బైటకుపోకు మాఁవా."

"అయితే కూడు ?"

"పోయినా బేగా ఒచ్చియి మాఁవా. నా నొక్కత్తి ఉండ లేను."

"ఈపాలి ఎన్నిసేప లట్టుకొచ్చానో నీకేటి తెలుసు రత్తీ. రా సూపిత్తాను."

"వొద్దే పడ్డాయా మాఁవా సేపలు ?"

"రా సూద్దువుగాని."

"సూడ్డానికేంలే మాఁవా. నువు మళ్లీ తిరిగొచ్చావు. అంతేసాలు. మాఁవా .... "

"ఏందో సెప్పబోయి ఆగిపోయావేం రత్తీ ?"

"సెప్పమంటావా ?"

"సెప్పు రత్తీ."

"ఊహు నీ కోపం ఒత్తది !"

"రాదు. సెప్పు రత్తీ. నాసావిరంగా. ఈయాల నా పాటు సూసి నువు ఎగిరి గంతేత్తా వనుకొండాను. ఇట్టా వుండావేం రత్తీ ?"

"ఎట్టా ఉండాను మాఁవా ?"

"ఏందో ఎట్టానో ఉండావు!"

"నేదు మాఁవా. ఉయ్యాల్లో కోపాలి సూడు."

అంది రత్తి. గంగయ్య ఉయ్యాల్లోనికి తొంగి చూసాడు. తన కళ్లను తానే నమ్మలేకపోయాడు. ఉయ్యాల్లో ఉన్న బిడ్డలు ఇద్దరు కాదు. కళ్లు నలుపుకు మరీ చూశాడు. ఇద్దరు కాదు ! ముగ్గురు !

"ఈ డెవడే రత్తీ ?"

"మన నాగులు కొడుకు మాఁవా "

"అయితే ఈడకేటి కొచ్చాడు."

"అది మన కిచ్చేసింది మాఁవా ?"

"ఊహు. అదిచ్చేత్తే నువ్వుచ్చుకొన్నావన్నమాట!" అంటూ దురుసుగా నాగులు బిడ్డను ఉయ్యాల నుంచి పైకి తీశాడు. భుజంపై వేసికొని ఒక్క అడుగులో గుడిసె ఇవత లకు వచ్చాడు. రత్తి గుండె లొక్కసారిగా గుభిల్లుమన్నాయి.

"ఏడుందే అది ?" అన్నాడు భయంకరంగా.

"నాగులు నేదు మాఁవా."

"ఏటయ్యింది ?"

"సచ్చిపోయింది."

గంగయ్య వేసిన అడుగు వేసినట్లే ఉండిపోయాడు. ఏదో విద్యుత్ప్రసారం తన శరీరంలో నరనరాన్ని వెనక్కి లాగి నట్లయింది.

"ఏటే సచ్చిపోయిందా ?"

"అవును మాఁవా ! నాగులు సచ్చిపోయింది. సత్తూ సత్తూ ఈ బిడ్డను నా సేతుల్లో పెట్టి మరీ సచ్చి పోయింది. నానేటి సేసేది ? సూత్తూ సూత్తూ పసి గుడ్డును ఒగ్గేయనేకపోయాను మాఁవా ! తీసుకొచ్చేశాను నీవేటి సేసినాసరే మాఁవా. కోపం వత్తే నన్ను కొట్టు మాఁవా!'

"రత్తీ!"

"ఈ బుడతకు తండ్రి లేనేలేడు. తల్లికూడా రేతిరి నుంచి లేకుండా పోయింది. దిక్కులేని ఈ బుడత ఏమై పోవాలి మాఁవా ?"

"రత్తీ!"

"మనం లేనోళ్లమే అనే సంగతి తెలుసు మాఁవా! మనం పడే కట్టాలూ నాకు తెల్సు మాఁవా! అయినా బిడ్డను కాదనలేకపోయాను మాఁవా. మనతోపాటే కలో గంజో పోసి పెంచుకొందాం మాఁవా. బెంగెట్టుకోకు."

గంగయ్య ఒక్కసారిగా రత్తికళ్లల్లోనికి చూశాడు. మధురమైన మాతృత్వంతోను, మమకారంతోను ఆర్ద్ర లయిన ఆమె కన్నులు చూసి చలించిపోయాడు. దిక్కూ మొక్కూ లేని ఆ దీనశిశువుపై జాలి ఆ ఇరువురు దంపతు లనూ ఆవహించింది.

"పోనీలే రత్తీ !" అన్నాడు గంగయ్య.

రత్తికళ్లు తుడుచుకొని గంగయ్యను చూసింది.

"మనం లేనోళ్లం కావచ్చు రత్తీ. కాని జాలి లేనోళ్లం కాదు. ఈ బుడతణ్ణి పెంచుదాం. ఏదో లాపెంచుదాం. ఫరవాలేదు. ఏడవకు."

అంటూ గంగయ్య రత్తిని తన గుండెలకు హత్తు కొన్నాడు. ఆ సమయంలో రత్తికి గంగయ్య గంగయ్యలా కనిపించ లేదు. ఎదిగిపోతున్న ఏదో దేవుడులా కనిపించాడు. రత్తికూడా గంగయ్యకళ్లకు రత్తిలా కనిపించలేదు. ఏదో వెల కట్టరాని రత్నంలా కనిపించింది. దూరంగా తూరుపుకొండ ల్లోంచి తలఎత్తుతూన్న బాలభానుడు తన లేతకిరణా లతో వారిని ఆశీర్వదించాడు !